# మాగంటి గోపీనాథ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



రాజ్‌నగర్ బస్తీలో మాగంటికి మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



వీకర్‌సెక్షన్‌లో ఇంటింటికీ ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నేతలు

ఎర్రగడ్డ, నవంబర్ 3: జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి గోపీనాథ్‌కు మద్దతుగా పార్టీ శ్రేణులు నిర్వహిస్తున్న ప్రచారానికి విశేష స్పందన లభిస్తున్నది. బోరబండ, ఎర్రగడ్డ డివిజన్లలోని ఏ వీధిని చూసినా గులాబీ మయంగా దర్శనమిస్తున్నాయి. శుక్రవారం ఎక్కడికక్కడా ప్రతి బస్తీలో డివిజన్, బూత్ స్థాయి నేతలు, కార్యకర్తలు పార్టీ జెండాలను చేత బూని, గులాబీ కండువాలతో గడప గడపకు వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు. సీఎం కేసీఆర్ పరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి గురించి, నియోజకవర్గంలో 9 ఏండ్లుగా కోట్లాది రూపాయలతో జరిగిన అభివృద్ధి గురించి స్థానికులకు వివరించారు. మాగంటి గోపీనాథ్‌ను ఈ సారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. బోరబండ డివిజన్‌లో పెద్ద బస్తీ అయిన రాజ్‌నగర్‌లో బీఆర్‌ఎస్ నేతలు జైభీమ్ యాదగిరి, సుధాకర్, శ్రీకాంత్, పర్వతాలు, ఆంజనేయులు, శంకర్, భూపతిరెడ్డి, యూనిస్, రాజ్‌కుమార్, సువర్ణకుమారి, లక్ష్మణ్ పాల్గొన్నారు. వీకర్‌సెక్షన్‌లోని జ్యోతినగర్‌లో యూసుఫ్ ప్రచారం నిర్వహించారు.

## బీఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్,నవంబర్ 3: జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీనగర్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడ ప్రాంతానికి చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. స్థానిక నేత లడ్డు ఆధ్వర్యంలో కృష్ణమోహన్, సంతోష్‌కుమార్, శ్రీకాంత్, సాయికుమార్ యాదవ్, రమణ, నీరజ్ తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు.

## ఓటు హక్కును వినియోగించుకోవాలి



ఓటరు జాబితా పరిశీలిస్తున్న ఏఈఆర్వో, ఏఎంసీ బాల్‌రాజు

జూబ్లీహిల్స్,నవంబర్3: అర్హులందరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని జూబ్లీహిల్స్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్, డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సేవా ఎస్లావత్ సూచించారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో ఓటర్లకు అవగాహన కల్పించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు బృందాలుగా పర్యటిస్తున్నారు. శుక్రవారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో ఓటు ప్రాధాన్యతపై ఇంటింటికీ అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ సేవా ఎస్లావత్ మాట్లాడుతూ పటిష్ట ప్రజాస్వామ్యానికి ఓటు పునాది వేస్తుందని.. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. వృద్ధులు, దివ్యాంగులు ఇంటివద్ద పోస్టల్ బ్యాలెట్‌తో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఈ మేరకు సీనియర్ సిటిజన్లకు, పీడబ్ల్యూడీ ఓటర్లకు 12 డీ ఫారంలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఓటరు జాబితాను సరిచూస్తూ.. ఓటర్ల ఫోన్ నంబర్లను సేకరిస్తూ.. బాధ్యతగా ఓటు వేస్తామని సంతకాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ పోలింగ్ స్టేషన్ల నంబర్లను సూచించే స్టిక్కర్లు వేస్తూ ఓటు ప్రాధాన్యతపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్‌ఓలు ఏసీపీ రాణి, ఏఎంసీలు బాలరాజ్, కమల్, ఎంటమాలజీ ఏఈ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించాలి

వెంగళరావునగర్, నవంబర్ 3 : శాసనసభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా అన్ని వ్యాపార సముదాయాలు, దుకాణాలు రాత్రి 11 గంటలకల్లా మూసివేయాలని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మధురానగర్ పోలీసుస్టేషన్ ఆవరణలో పాన్ షాపులు,హోటళ్ల నిర్వాహకులు, రెస్టారెంట్ యాజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వీధి వ్యాపారులతో పాటు..అన్ని వ్యాపార సంస్థలు, హోటళ్లను సమయానికి మూసేయాలని కోరారు. దుకాణాలు, హోటళ్లు, వీధి దుకాణాలు తెరిచి ఉంచడం వల్ల గొడవలు, కొట్లాటలు జరిగే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. ప్రశాంతంగా ఎన్నికలను నిర్వహించేందుకు పోలీసులకు సహకరించాలని వ్యాపారులను కోరారు. పోలీసు నిబంధనలు పాటించకపోతే చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. మధురానగర్ ఎస్సై ఉదయ్,సాయినాథ్ రెడ్డి,ఇక్బాల్ పాల్గొన్నారు.



వ్యాపారుల సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్

## అక్రమంగా మద్యం అమ్మితే చర్యలు తప్పవు

బేగంపేట్ నవంబర్ 3: అక్రమగా మద్యం, కల్తీ మద్యం అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సికింద్రాబాద్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం బేగంపేట్‌లోని ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మద్యం షాపుల ద్వారా అమ్మబడే మద్యం తప్ప మరేదైనా అక్రమ మద్యం కిందకే వస్తుందన్నారు. తెలంగాణ మద్యాన్ని గుర్తించడానికి ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్‌లలో వెరిట్ అనే యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని ఆ యాప్ సహాయంతో మద్యం బాటిల్‌పై ఉన్న హోలోగ్రామ్‌ను స్కాన్ చేస్తే అట్టి బాటిల్ వివరాలు మొబైల్ ఫోన్ తెరపై ప్రత్యక్షమవుతాయని అన్నారు. మద్యం పేరు బాటిల్ సైజ్, ఎంఆర్‌పీ, తయారైన కంపెనీ, డిపో పేరు,ఏ షాపు నుంచి అమ్మబడింలో వివరాలు తెలుస్తాయన్నారు. స్కాన్ చేసినప్పుడు ఈ వివరాలు రాకపోతే అట్టి మద్యం అక్రమ మద్యం అని భావించి వెంటనే ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 87126 59644 నంబర్‌కు సమాచారం అందించాలని అన్నారు.

**కేసులు నమోదు చేస్తాం..**

సాధారణ ఎన్నికల సందర్భంగా జిల్లా ప్రోహిబిషన్ ఎక్సైజ్ అధికారి పవన్‌కుమార్ ఆదేశాల మేరకు అక్టోబర్ నెలలో విస్తృతంగా దాడులు నిర్వహించి 30 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. ఈ కేసులలో 22 మందిని అరెస్ట్ చేసి వారి వద్ద 172 లీటర్ల ట్యాక్స్ చెల్లించని మద్యం 18లీటర్ల లిక్కర్ (డిఫెన్స్) తెలంగాణ మద్యం 96 లీటర్లు, బీర్లు (600), నల్ల బెల్లం 55 కిలోలు, పటిక 86 కిలోలు ఎండు గంజాయి 575 గ్రాములు గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. ఆరు మద్యం బాటిళ్ల కంటే ఎక్కువ తీసుకు వెళితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

**వెంటనే ఫిర్యాదు చేయాలి**

అమీర్‌పేట్, నవంబర్ 3 : ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో అక్రమంగా మద్యం విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని అమీర్‌పేట్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ ఎస్‌హెచ్‌వో సైదిరెడ్డి హెచ్చరించారు. అక్రమ మద్యం పట్ల ఎవరికైనా సమాచారం ఉంటే వెంటనే 1800-4252523 టోల్ ఫ్రీ నెంబరులో సమాచారం అందించాలని కోరారు. వెరిట్ యాప్ ద్వారా అక్రమ మద్యాన్ని గుర్తించడం జరుగుతుందని తెలిపారు. అమీర్‌పేట్ స్టేషన్ పరిధిలో ఇప్పటి వరకు 22 కేసులు, 1478 లీటర్ల మద్యాన్ని సీజ్ చేయడం జరిగిందని తెలిపారు.

## నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి



ఎన్నికల నోటిఫికేషన్‌ను నోటీసు బోర్డులో ప్రదర్శిస్తున్న ఆర్వో రవి

జూబ్లీహిల్స్,నవంబర్3: అసెంబ్లీ ఎన్నికలకు తొలిరోజు జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి బంజారాహిల్స్‌లోని షేక్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలోని రిటర్నింగ్ ఆఫీసర్ కార్యాలయంలో నామినేషన్లు స్వీకరించేందుకు రంగం సిద్ధం చేశారు. సికింద్రాబాద్ ఆర్డీఓ, జూబ్లీహిల్స్ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ రవి, డిప్యూటీ కలెక్టర్ శివకుమార్‌తో కలిసి నామినేషన్లు స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఉదయం 11గంటల నుంచి 3 వరకు అభ్యర్థులు ఎవరూ రాకపోవడంతో అధికారులు మొదటిరోజు నిల్ నామినేషన్లుగా ప్రకటించారు. నామినేషన్ల సందర్భంగా జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్ ఆధ్వర్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఈఆర్‌ఓ సేవా ఎస్లావత్, ఏఈఆర్‌ఓలు.. ఏసీపీ రాణి, ఏఎంసీలు బాలరాజ్, కమల్, తహసీల్దార్ నయాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం



నార్సింగిలోని విద్యుత్ డివిజనల్ ఇంజినీరింగ్ కార్యాలయంలో సమస్యలపై చర్చిస్తున్న అధికారులు

మణికొండ, నవంబర్ 3 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు శక్తివంచనలేకుండా పనిచేస్తున్నామని సైబర్ సిటీ సర్కిల్ ఎస్‌ఏఓ ఎంపీ రవికుమార్ అన్నారు. వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం నార్సింగిలోని విద్యుత్‌శాఖ డివిజనల్ కార్యాలయంలో వినియోగదారులతో అధికారులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి 10 ఫిర్యాదులను అందుకుని తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు.

## రోడ్డు పనులు పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలి



రోడ్డు పనులు త్వరగా పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని శంషాబాద్ రూరల్ సీఐ శ్రీధర్‌కుమార్ సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్‌లతో కలిసి రోడ్డు రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొంత కాలం నుంచి హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారిలో తొండుపల్లి రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన నడుస్తుండటంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో నిత్యం గంటల తరబడి ట్రాఫిక్‌లోనే ఉంటున్నారు. దీంతో రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడంతో పాటు బ్రిడ్జి కి ఇరువైపుల రోడ్డు పూర్తిగా గుంతలుగా మారింది. గుంతలను పూడ్చివేయాలని సూచించారు.

-శంషాబాద్ రూరల్, నవంబర్ 3 :

## భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

ఖైరతాబాద్, నవంబర్ 3 : ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి భవనంపై నుంచి పడి మృతి చెందాడు. ఈ ఘటన పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...నగరానికి చెందిన కైలాష్ జైన్ (35) పంబ్లర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం పంజాగుట్టలోని కాంతిశిఖర అపార్ట్‌మెంట్‌లోని రెండో అంతస్తులో పనిచేస్తుండగా, ప్రమాదవశాత్తు కిందపడిపోయాడు. తీవ్ర గాయాలు కాగా, మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.